క్లుప్తంగా

ఏప్రిల్ 5న పంగుణి ఉత్తర కల్యాణ మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఇంద్రకీలాద్రిపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఏప్రిల్ ఐదో తేదీన పంగుణి ఉత్తర కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్వీ సుబ్బారావు తెలిపారు. సుప్రభత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అనంతరం గణపతి హోమం, బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఏకవార క్షీరాభిషేకం, కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఏకాదశ రుద్రపారాయణ సహిత మహాభిషేకం, అనంతరం శతాధిక కలశాభిషేకం తదితర వైదిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అభిషేకాల అనంతరం స్వామి వారిని పెండ్లికుమారినిగా అలంకరిస్తారని తెలిపారు. సాయంత్రం వరపూజ, ఆరు గంటలకు కల్యాణం, రాత్రి పదిన్నర గంటలకు స్వామి వారి పవళింపు సేవ తదితర కార్యక్రమాలుంటాయని వివరించారు.

వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ. 2.27 లక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారికి భక్తులు హుండీల ద్వారా రూ.2.27 లక్షల ఆదాయాన్ని కానుకలు , మొక్కుబడులుగా సమర్పించారు. స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను సోమవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. దేవదాయ శాఖకు చెందిన వై. సీతారామయ్య పర్యవేక్షణలో ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు నేతృత్వంలో కానుకల లెక్కింపు జరిగింది. ఏడాది కాలానికి రూ. 2,27,273 నగదు లభించినట్లు ఈవో పేర్కొన్నారు. చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ, ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పిన్ని వాళ్ల ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మహంతిపురం మస్తాన్ వీధికి చెందిన యంపాటి శ్రీనుకు ఇద్దరు సంతానం. కుమారుడు కుమార్ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుండగా, కుమార్తె పావని 9వ తరగతి వరకు చదివి సామారంగ చౌక్‌లోని బట్టల షాపులో పని చేస్తుంది. 19వ తేదీ ఆదివారం పావని శ్రీనివాసమహల్ వద్ద ఉంటున్న పిన్ని వాళ్ల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమార్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పావని గతంలో అజయ్ అనే యువకుడితో చనువుగా ఉండేదన్నారు. దీంతో అజయ్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుమారుడు అదృశ్యంపై...

యువకుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన పేయ్యల కనకదుర్గ, సుబ్బారావు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు భార్గవ్ (23) బీటెక్ పూర్తి చేసి ఆరు నెలల కాలంగా ఉద్యోగానికి సిద్ధమవుతున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో ఈవెంట్‌కు చేసేందుకు వెళుతుండగా తల్లి వద్దని వారించింది. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన భార్గవ్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సికింద్రాబాద్‌కు చెందిన కె.సహస్ర నైనికరెడ్డి ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సోమవారం సాయంత్రం నైనిక రెడ్డి పలు కీర్తనలకు చక్కటి నాట్యంతో అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం నైనికరెడ్డికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందచేశారు.

సుధాకర్‌బాబుపై దాడి హేయమైన చర్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): అసెంబ్లీ సాక్షిగా శాసనసభ్యుడు సుధాకర్ బాబుపై టీడీపీ ఎమ్మెల్యే చేసిన దాడిని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గత టీడీపీ ప్రభుత్వంలో దళితులను అణిచివేశారని, ప్రతిపక్షంలో ఉండి కూడా ఆయన దర్శకత్వంలో దళిత ఎమ్మెల్యేపై దాడి చేయటం చంద్రబాబుకు దళితుల పట్ల ఉన్న చులకన భావానికి నిదర్శనమని తెలిపారు. ఇది చంద్రబాబు వెనుక ఉండి బీసీ, ఎస్సీ, ఎస్టీలపై చేయిస్తున్న దాడిగా పేర్కొన్నారు. స్పీకర్ పోడియం చుట్టుముట్టి కాగితాలు చింపి ఆయనపై వేయడం ప్రజాస్వామ్యానికే మచ్చ అన్నారు.



సిద్ధమవుతున్న హలీం సెంటర్లు!

ఈ నెల 23 నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విజయవాడలో హలీం సెంటర్లు నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వన్‌టౌన్ పంజా సెంటర్‌లో హలీం కేంద్రాలతో పాటు వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ పెట్టేందుకు సిద్ధమవుతున్న దుకాణాల చిత్రాలివి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





నిర్ణీత గడువులోగా స్పందన సమస్యలకు పరిష్కారం



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీఎంసీ అందిస్తున్న మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులకు సూచిచారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని మేయర్ ఆదేశిస్తూ, ప్రతివారం సమీక్షలో పరిష్కారమైన సమస్యల నివేదిక ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. స్పందనలో ఇంజినీరింగ్ విభాగంపై - 9, పట్టణ ప్రణాళిక విభాగం - 3, పబ్లిక్ హెల్త్ విభాగం - 3, రెవిన్యూ - 4, జాయింట్ డైరెక్టర్ (అమృత్) - 2పై అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ (జనరల్) యం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, పట్టణ సాధికారాభివృద్ధి విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లతా, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నారాయణమూర్తి, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందనలో చిట్టినగర్‌లోని సర్కిల్ - 1 కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం - 1, పట్టణ ప్రణాళిక విభాగం–1 అర్జీలు రాగా సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2 కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం - 1, పట్టణ ప్రణాళిక విభాగం - 1, రెవిన్యూ - 1 అర్జీ వచ్చాయి. పటమటలోని సర్కిల్ - 3 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం–1 అర్జీ వచ్చింది.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని ఆ పార్టీ నగర అధికార ప్రతినిధి మనోజ్‌కొఠారి అన్నారు. మనోజ్‌కొఠారి ఆధ్వర్యంలో వించిపేటకు చెందిన చిరువ్యాపారులైన రామకృష్ణ, అప్పారావులకు వ్యాపారం చేసుకునే నిమిత్తం రెండు తోపుడు బండ్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మనోజ్ కొఠారి మాట్లాడుతూ సమాజంలో పేదలకు అందరూ అండగా ఉండాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జగనన్న విద్యా దీవెనతో ఉన్నత చదువులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జగనన్న విద్యా దీవెన పథకం పేద విద్యార్థుల ఉన్నత చదువులకు దోహద పడుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యారంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల ఉన్నత విద్యకు ఇకపై పేదరికం ఆటంకం కాబోదని తెలిపారు. గత ప్రభుత్వంలో అరకొర ఫీజులతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించలేని దుస్థితి నుంచి ఫీజు ఎంతైనా ప్రభుత్వమే చెల్లించే జగనన్న మనందరి ప్రభుత్వం పాలనలో ఉండటం అదృష్టమని పేర్కొన్నారు. పేద విద్యార్థులుకూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యం సీఎం జగనన్నదన్నారు. విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అత్యంత ప్రాధాన్యత గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదని స్పష్టం చేశారు.

న్యాయవాదుల ఆందోళన

విజయవాడ స్పోర్ట్స్: న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) ప్రతినిధులు, న్యాయవాదులు సూర్యారావుపేటలోని కోర్టు ప్రాంగణం వద్ద సోమవారం ఆందోళన చేశారు. న్యాయవాది భగవాన్ తన పదేళ్ల కుమార్తెపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై ఫిర్యాదు చేస్తే భవానీపురం పోలీసులు తిరిగి న్యాయవాదిపైనే కేసు నమోదు చేశారంటూ ఆరోపించారు. బాధ్యులైన భవానీపురం సీఐ ఉమర్, ఏఎస్ఐ గంగాధర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ టీకే రాణాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షుడు చంద్రగిరి విష్ణువర్ధన్ మాట్లాడుతూ న్యాయవాది భగవాన్‌కు జరిగిన అన్యాయంపై తీవ్రంగా పోరాడతామన్నారు. అయితే కొన్ని రాజకీయ పార్టీల చోటా నాయకులు ఈ ఘటనను వారి రాజకీయ భవిష్యత్తుకు పునాదిగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బార్ అసోసియేషన్‌లో రాజకీయాలకు తావులేదన్నారు. న్యాయవాదులకు అన్యాయం జరిగితే వెంటనే స్పందిస్తామన్నారు. ఈ ఆందోళనలో బీబీఏ కార్యదర్శి గంధం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు నిర్మల రాజేష్, బీబీఏ మాజీ ప్రతినిధులు మన్మదరావు, జయకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల(ఏపీఎస్ఆర్ఎంసీ)లో సోమవారం నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ యూత్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదాదేవి ప్రారంభించారు. మ్యూజికల్ చైర్, లెమన్‌స్పూన్, స్కిప్పింగ్, హ్యాపింగ్ పోటీల్లో పాఠశాల విద్యార్థినులు తలబడ్డారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. యువజన సర్వీసుల శాఖ ఎన్టీఆర్ జిల్లా సీఈవో యు.శ్రీనివాసరావు, కార్యాలయ సూపరింటెండెంట్ పి.వి.రాఘవశర్మ, అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రమేష్ ఈ పోటీలను పర్యవేక్షించారు.

సినీ నటుడు శోభన్‌బాబుకు స్వరాంజలి

విజయవాడ కల్చరల్: సినీ నటుడు శోభన్ బాబు 15 వ వర్ధంతి సందర్భంగా బీవీఆర్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన స్వరాంజలి మధురంగా సాగింది. గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గాయకులు పాల్గొన్నారు. బీవీ రామ్మోహన్ ఆధ్వర్యంలో మల్లాది స్వాతి, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి, భారతి, షబానా, దేవిడ్‌రాజు, శివప్రసాద్ కుటుంబరావు, శోభన్ బాబు నటించిన సినిమాల్లోని పాటలను ఆలపించారు. తటవర్తి సూర్యనారాయణ, బీవీ వీరభద్రరావు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు బలరామకృష్ణ మూర్తి, ఉమాబలరాం పాల్గొన్నారు.



సినీ గీతాలు పాడుతున్న గాయనీ గాయకులు

విద్యార్థులకు కలెక్టర్ ఢిల్లీరావు ఆదర్శనీయం



కలెక్టర్‌ను అభినందిస్తున్న జిల్లా యంత్రాంగం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదురించి ఉన్నత శిఖరాలకు చేరి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సేనాపతి ఢిల్లీరావును స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంసించడం తమకు ఎంతో గర్వకారణమని పలువురు జిల్లా అధికారులు పేర్కొన్నారు. తిరుపూరులో నిర్వహించిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ ప్రశంసలు. అందుకున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును జిల్లా అధికారుల పక్షాన సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా మారుమూల గ్రామంలో అతి నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదివి కలెక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తున్న కలెక్టర్ సేనాపతి ఢిల్లీరావును ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వం అందించిన సహకారంతో ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రశంసించారని చెప్పారు. అత్యున్నత స్థానంలో ఉన్నప్పటికీ ఎటువంటి భేషజాలు లేకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులను సమన్వయ పరచుకుంటూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పాయకాపురం(విజయవాడరూరల్): టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన నున్న గ్రామ శివారు బోడపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి క్రింద సోమవారం చోటుచేసుకుంది. సీఐ కె. శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... సుందరయ్యనగర్‌కు చెందిన గరికపాటి మల్లికార్జునరావు (45) ఐస్‌క్రీమ్ బండి పై వ్యాపారం చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం బండిపై వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గరికపాటి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



లారీ ప్రమాదంలో మృతి చెందిన మల్లికార్జునరావు

హౌసింగ్ పీడీ శ్రీదేవి సేవలు స్ఫూర్తిదాయకం



పీడీ శ్రీదేవిని సత్కరిస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తదితరులు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదవాని సొంతింటి కల నెరవేర్చాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంలో గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి. శ్రీదేవి అందించిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీదేవి బదిలీ అయిన సందర్భంగా సోమవారం పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్ అజయ్ కుమార్ జిల్లా అధికారులతో కలిసి ఆమెను సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖలో 40 సంవత్సరాలుగా శ్రీదేవి సుదీర్ఘ సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గత 4 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఎన్టీఆర్ జిల్లా పీడీ గా పదవీ బాధ్యతలు చేపట్టి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో తనదైన శైలిలో సేవలు అందించారన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ తన శాఖలో ప్రగతి చూపారన్నారు. గృహ నిర్మాణ శాఖ నూతన ప్రాజెక్టు డైరెక్టర్ గా నియమితులైన యం. రజనీ కుమారి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు పలువురు జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవిని సన్మానించిన వారిలో డీఆర్వో కె. మోహన్ కుమార్, డ్వామా పీడీ జె. సునీత, ఐసిడిఎస్ పిడీ జి. ఉమాదేవి, డిఎస్వో కె. కోమలి పద్మ, మార్క్ ఫెడ్ నాగమల్లిక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యం.విజయభారతి, సిపివో రత్నరూత్, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె. అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎస్ వి.విజయభారతి తదితరులు ఉన్నారు.

62 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆంధ్రా బ్యాంక్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్, విన్ విజన్ కంటి హాస్పటల్ ఆధ్వర్యంలో సోమవారం 62 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. గొల్లపూడిలోని ఆషా హాస్పటల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కొండపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన 123 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అందులో 62 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు వారికి సోమవారం కేటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించారు. విన్ విజన్ కంటి హాస్పటల్‌కు చెందిన కంటి వైద్య నిపుణులు డాక్టర్ నిషాంత్, డాక్టర్ హారికల ఆధ్వర్యంలో పలు దఫాలుగా ఆపరేషన్లు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆపరేషన్ జరిగిన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు అందించామన్నారు. విన్‌విజన్ కంటి హాస్పటల్ నిర్వహణాదికారి డి.అంజిబాబు, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధులు నిడుమోలు కృష్ణమోహన్, ఎంవీఎస్. శర్మ తదితరులు పర్యవేక్షించారు.



కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు

నోటి సంబంధిత రోగాలపై అవగాహన



రోగులకు పేస్ట్, బ్రష్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వాణిశ్రీ



నోటి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామ్‌సునీల్

వించిపేట(విజయవాడపశ్చిమ): నోటి సంబంధిత రోగాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని షేక్ రాజాసాహేబ్ మీని జనరల్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిశ్రీ తెలిపారు. 'వరల్డ్ ఓరల్ హెల్త్ డే' సందర్భంగా కొత్తపేటలోని మీని జనరల్ ఆసుపత్రిలో నోరు, దంతాల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అందుకు ప్రతి రోజు రెండు సార్లు బ్రష్‌తో పళ్లు తోముకోవాలన్నారు. నోటి సమస్యలకు ప్రధానంగా మద్యపానం, గుట్కాలు, కిళ్లీలు, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వలన నోటిలో సమస్యలు వస్తాయన్నారు. ముఖ్యంగా నోటిపూత, పుండ్లు, నాలుకమీద మచ్చలు వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నప్పుడు అశ్రద్ధ చేయకుండా దంత వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. లేని పక్షంలో నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం రోగులకు పేస్ట్, బ్రష్‌లు పంపిణీ చేశారు. ఆసుపత్రి డాక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురష్కరించుకుని సోమవారం విజయవాడ రైల్వే హాస్పటల్‌లో నోటి ఆరోగ్యంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ముఖ్యఅతిథిగా శ్రీనిధి హాస్పటల్ ఎండిఎస్ డాక్టర్ సిహెచ్ రామ్‌సునీల్ పాల్గొని నోటి ఆరోగ్యంపై విద్యార్థులు, రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నోటి పరిశుభ్రత పద్ధతులను పాటించడానికి, దంత సంబంధిత రోగాలను నివారించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. అనారోగ్యకరమైన నోటి పరిశుభ్రత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపుతాయని తెలిపారు. అనంతరం దంతాలను శుభ్రపర్చుకునే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే హాస్పటల్ ఏసీఎంఎస్‌లు డాక్టర్ రవికాంత్, డాక్టర్ ఎమ్. జయ్‌దీప్ మాట్లాడుతు నోటి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ సెమినార్ ముఖ్య ఉద్దేశం అన్నారు. తరచుగా దంత వైద్యులతో పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. జాక్ అండ్ జిల్ స్కూల్ విద్యార్థులు, రోగులు, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనలో 55 ఫిర్యాదులు

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో 55 మంది బాధితులు ఫిర్యాదులు అందజేశారు. నగదు లావాదేవీలపై 14, కుటుంబ కలహాలపై ఏడు, ఆస్తి వివాదాలపై ఏడు, మోసాలపై ఎనిమిది, ఇతర సమస్యలపై 19 మంది ఫిర్యాదులు ఇచ్చారు. డీసీపీ మేరీ ప్రశాంతి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం బాధితులతో మాట్లాడారు. ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను డీసీపీ ఆదేశించారు.



పోలీస్ కమిషనరేట్‌లోని స్పందనలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

12 టైర్ల లారీ దహనం

పాయకాపురం(విజయవాడరూరల్): గుర్తు తెలియని వ్యక్తులు 12 టైర్ల లారీని దహనం చేసిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. దంతల నరేంద్రకుమార్‌కు చెందిన లారీని ఈ నెల 17వ తేదీన కండ్రిక కేర్ అండ్ షేర్ స్కూల్ వద్ద పార్కు చేసి ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున లారీ కాలిపోవడాన్ని గుర్తించి స్థానికులు నరేంద్రకు ఫోన్ చేసి చెప్పారు. ఆయన ఘటన స్థలానికి వచ్చి అగ్ని మాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తన లారీకి నిప్పు పెట్టినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.